హనుమంత వాహనంపై రామయ్య విహారం

ప్రజాశక్తి-వాల్మీకిపురం: వాల్మీకిపురం వెయ్యేళ్ల చరిత్ర కలిగిన శ్రీ పట్టాభిరామాలయంలో బుధవారం పట్టాభిషేక మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ మొదలై ఆలయంలో మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భోగోత్సవ మూర్తులైన సీతారామలక్ష్మణులకు వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఆలయంలోని కల్యాణ వేదికపై సీతారాములను అధిష్టింపజేసి, మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చారణలు, విశేష భక్తజనం నడుమ సీతారాముల కల్యాణోత్సవం కన్నులపండుగగా నిర్వహించారు. సాయంత్రం ఉంజల్ సేవ, రాత్రికి విశేషాలంకృతుడైన పట్టాభి రాముడిని హనుమంత వాహనంపై పురవీధులలో విహరించారు. కార్యక్రమాలలో టిటిడి అధికారులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై విహరిస్తున్న పట్టాభిరాముడు

కూటమి ప్రభుత్వంతోనే మహిళా సాధికారత

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

కూటమి ప్రభుత్వంతోనే మహిళా సాధికారత సాధిస్తుందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ శ్రీధర్ చామకూరితో కలిసి ఎస్‌హెచ్‌జి గ్రూపుల నుంచి ఎంపిక చేసిన పది మందికి పది గుడ్ల అమ్మకపు బండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సిఎం చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం వల్లే మహిళా సాధికారత సాధ్యమైందన్నారు. మహిళా సంఘాలు అభివృద్ధి చెందడానికి సిఎం ఎంతో కృషి చేస్తున్నారని, ఆ కృషి ఫలాలే నేడు ఎస్‌హెచ్‌జి గ్రూపుల ద్వారా మహిళలందరూ లబ్ధి పొందు తున్నారని అన్నారు. మహిళా సంఘాలకు అందజేసిన గుడ్ల అమ్మకపు బండ్లు పౌష్టికాహారంతో పాటు గ్రామీణ ప్రజలకు జీవనోపాధి కలిగిస్తాయని అన్నారు. ఒక్కొక్క గుడ్డు అమ్మకపు బండి రూ.50వేలు విలువ చేస్తుందని ఈ బండిని ప్రభుత్వం లబ్ధిదారులకు ఉచితంగా అందిస్తోందని చెప్పారు. జాతీయ గుడ్డు సమన్వయ కమిటీ సూచనల మేరకు గుడ్లు తినడం వల్ల శరీరానికి పోషకాలు అందుతాయని ప్రజలందరూ ముఖ్యంగా గ్రామీణ ప్రజలు గుడ్లు తినడం అలవాటు చేసుకునే విధంగా ఈ గుడ్ల అమ్మకపు బండ్లు తోడ్పడతా యన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలకు పౌష్టికాహారాన్ని అందివ్వడం, గ్రామీణ ప్రజలకు జీవనోపాధి కలిగించడం ముఖ్యలక్ష్యమన్నారు. రెండు లక్ష్యాలతో గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం, జాతీయ గుడ్డు సమన్వయ కమిటీ తో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం మేరకు ఈ గుడ్ల అమ్మకపు బండ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ ఒప్పందం ప్రకారం 2025-26 సంవత్సరంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు మొత్తం 1000 ఎస్‌హెచ్‌జి గ్రూపులలోని ఒక్కొక్క సభ్యురాలికి ఒక గుడ్డు అమ్మకపు బండి చొప్పున మొత్తం 1000 గుడ్డు అమ్మకపు బండ్లను సరఫరా చేయనున్నారన్నారు. మొదటి దశలో అన్నమయ్య జిల్లాకు 10 గుడ్డు అమ్మకపు బండ్లు అందించినట్లు తెలిపారు. లబ్ధిదారులకు గుడ్ల అమ్మకపు బండితోపాటు 15 రకాల వంట పాత్రలు కూడా అందించినట్లు తెలిపారు. ఎల్ఇడి బల్బు, గ్యాస్ స్టవ్, హాట్ బాక్స్, స్పూన్స్, కట్టరు, నూడిల్స్ పాను, వాటర్ క్యాన్, వంటి 15 రకాల వంట సామగ్రి అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ పాల్గొన్నారు.

డ్వాక్రా గ్రూపు సభ్యురాలికి పత్రాన్ని అందజేస్తున్న మంత్రి, కలెక్టర్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రామాపురం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. నాయకులు కార్యకర్తలు గజమాలలు, బాణసంచాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి గురించి ప్రజలకు తెలియజేశారు. రెడ్డివారిపల్లి నుంచినందివాండ్లపల్లి వరకు రూ.75 లక్షల నిధులతో బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న నాలుగేళ్లలో నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి, ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి చూపిస్తామన్నారు. మండల పరిధిలోని చింతకుంటవాండ్లపల్లిలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు, మహిళల ఏర్పాటు చేసిన రచ్చబండలో మంత్రి పాల్గొని ప్రజలతో ముఖాముఖి మాట్లాడి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.6లక్షలతో చింతకుంట వాండ్లపల్లెలో శాశ్వత తాగునీటి బోరును ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి మండల ఇన్‌ఛార్జి యనమల మదనమోహన్, మార్కెట్ చేర్మెన్ షఫీనాయక్, మాజీ జడ్‌పిటిసి రెడ్డెయ్యయాదవ్, మాజీ ఎపిఐఐసి చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కొండూరు వెంకట్రామరాజు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొప్పాయి వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రైల్వే కోడూరులో బొప్పాయి వ్యాపారస్తులు, సేట్లు సిండికేట్ అయి బొప్పాయి రైతులకు ధర తగ్గిస్తున్నారని లక్షలు, కోట్లలో వ్యాపారం చేస్తున్న దళారులను నియంత్రించడానికి లైసెన్సులు లేని వారిపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు పందికాళ్ళ మణి డిమాండ్ చేశారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ లైసెన్సు ఉన్న వ్యాపారస్తులు గిట్టుబాటు ధర లేక అవస్థలు పడుతున్నారన్నారు. ధర తగ్గించి రైతులను మోసం చేసే వారి లైసెన్సులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మధ్య దళారుల మోసాలకు అడ్డు, అదుపు లేదన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం బొప్పాయి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని సబ్ కలెక్టర్‌ను కోరగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన మరుసటి రోజే దళారులు, సేట్లు సిండికేట్ అయి మంగళవారం మరలా రెండు రూపాయలు తగ్గించారన్నారు. రూ.16 నుంచి రూ.11కు ధర తగ్గించారన్నారు. బుధవారం మరల ధర తగ్గించాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. 18 టన్నులు లోడు పైన రైతులు ఒకటిన్నర లక్ష రూపాయలు నష్టపోతున్నారని అన్నారు. మరోపక్క 1000 కిలోలకు 100 కిలోల సూటు పేరుతో రైతులను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. సూటు రద్దు చేయాలన్నారు. వ్యాపారస్తుల పైన ప్రభుత్వం నియంత్రణ లేదని, బొప్పాయి రైతులకు కనీసం కిలో రూ.25లు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన నాలుగు రూపాయల సబ్సిడీ ఇంతవరకు రైతు ఖాతాల్లో పడలేదని పేర్కొన్నారు. అధికార పార్టీ, ప్రజా ప్రతినిధులు దీనిపై స్పందించి ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకోవాలన్నారు. పోలీసులు వైఖరి మారాలని, కేసులు పెడతామని రైతులను బెదిరించడం మానుకోవాలని, రైతులను మోసం చేస్తున్న దళారులపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షం లో నియోజకవర్గంలోని ఐదు మండలాల బొప్పాయి రైతులు రోడ్డు పైకి రావాల్సి వస్తుందని హెచ్చరించారు. సబ్ కలెక్టర్ వైకోమ్ నైదియదేవి రైల్వే కోడూరులో రెండు రోజుల్లో రైతులు, వ్యాపారస్తులతో, మార్కెటింగ్ అధికారులతో, జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు వై.ఆదినారాయణ, తుంగ శివకృష్ణ, మన్నూరు విశ్వనాథరెడ్డి, తిరుమల చరణ్, ఈర్ల ఈశ్వరయ్య, వై.ప్రేమ్ చంద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు, రైతు సంఘం నాయకులు

పింఛన్లు వంద శాతం పంపిణీ చేయాలి : కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో ఆగస్టు 1న వంద శాతం ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జరగాలని కలెక్టర్ చామకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో డిఆర్‌డిఎ పీడీ, మున్సిపల్ కమిషనర్లు, డిపిఒ, ఎంపిడిఒలు, డిఎల్‌డిఒలు, ఎల్‌డిఎం తదితర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆగస్టు 1న జరగబోయే ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గురువారం సాయంత్రానికి నగదు మొత్తాన్ని బ్యాంకుల నుంచి విత్ డ్రా చేసుకొని అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. పింఛన్ల పంపిణీకి అందుబాటులోలేని వారు, ఆసుపత్రులలో చికిత్స తీసుకుంటున్నారు తప్ప మిగతా 99 శాతం పింఛన్ల పంపిణీ ఒకటో తారీకు నే జరగాలన్నారు. లబ్ధిదారులకు ముందస్తు సమాచారాన్ని టామ్ టామ్, ఇతర మాధ్యమాల ద్వారా అందించి వారు ఇంటి వద్దనే ఉండేలా చూడాలన్నారు. బదిలీపై నూతనంగా వచ్చిన సచివాలయ సిబ్బంది పింఛను లబ్ధిదారుల ఇంటి చిరునామాలను ముందే గుర్తించి పెన్షన్ పంపిణీ వేగవంతంగా జరిగేలా చూడాలన్నారు. పింఛను లబ్ధిదారుల నుండి నగదు తీసుకున్నట్లు సమాచారం ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదేశించారు. ఒకటో తారీకు ఉదయం 7 గంటలకు పంపిణీ మొదలు పెట్టాలన్నారు. పింఛన్ల పంపిణీ జరిగేటప్పుడు ప్రజలందరూ గుమి కూడకుండా చూడాలన్నారు. సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు మంత్రులు , ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొనేటప్పుడు ఏ ఇంటిలో అయితే పింఛను పంపిణీ జరుగుతుందో ఆ ఇంటి వారు మాత్రమే పింఛను పొందేలా చూడాలని తెలిపారు. పింఛన్ల పంపిణీ పై ఎప్పటికప్పుడు పర్య వేక్షించాలని పీడీ, మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. అనంతరం స్వర్ణాంధ్ర - పి-4, ప్రధానమంత్రి సూర్య ఘర్ బిజిలి యోజన, అన్నదాత సుఖీభవ, తదితర అంశాలపై పలు సూచనలను చేశారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, ఎల్‌డిఎం ఆంజనేయులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ మ్యాచ్‌లు

తలపడుతున్న కడప, అనంతపురం జట్లు

ప్రజాశక్తి - కడప

కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ సౌత్ జోన్ అండర్-16 మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా జరుగుతున్న మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. ఎసిఎ స్టేడియంలో కడప, అనంతపురం జట్లు తలపడుతున్నాయి. మొదటి ఇన్నింగ్స్‌లో అనంతపురం జట్టు 53.1 ఓవర్లలో 186 పరుగులకు ఆలౌటైంది. ఐదు వికెట్లు నష్టానికి 128 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 53.3 ఓవర్లలో 158 పరుగులకు ఆలౌటైంది. ఆ జట్టులోని సిరాజుద్దీన్ 51 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని దేవాన్ష్ 3, కిరణ్ కుమార్ 2, సంజయ్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి 70 ఓవర్లలో ఆరు వికెట్లు నష్టానికి 242 పరుగులు చేసింది. ఆ జట్టులోని ఆదినారాయణరెడ్డి 118 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. కడప జట్టులోని గైబు మూడు వికెట్లు తీసుకున్నాడు.

మొదటి ఇన్నింగ్స్‌లో చిత్తూరు జట్టు 325 ఆలౌట్ : కెఒఆర్‌ఎం క్రికెట్ మైదానంలో జరుగుతున్న మ్యాచ్‌లో చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 325 పరుగులకు ఆలౌటైంది. ఆ జట్టులోని ప్రభాకర్ 130 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. కర్నూలు జట్టులోని యుహాస్ 4, వివేక్ 3, సాయి విగ్నేష్ 3 వికెట్లు తీసుకున్నారు. వికెట్ నష్టపోకుండా 44 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన కర్నూలు జట్టు ఆట ముగిసే సమయానికి మొదటి ఇన్నింగ్స్‌లో 100 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 300 పరుగులు చేసింది. ఆ జట్టులోని రుత్విక్ కళ్యాణ్ 90 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టులోని మాలిక్ మూడు, రక్షణ సాయి 2 వికెట్లు తీసుకున్నారు.

తొలిరోజు ఐదు నామినేషన్లు

పులివెందులకు మూడు, ఒంటిమిట్టకు రెండు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో జడ్‌పిటిసి ఎన్నికల నామినేషన్లు ఊపందుకున్నాయి. రాష్ట్ర ఎన్నికల కమిషన్ జిల్లాలోని ఒంటిమిట్ట, పులివెందుల జడ్‌పిటిసి ఖాళీలను భర్తీ చేయడానికి ఉద్దేశించి నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. తొలిరోజైన బుధవారం ఒంటిమిట్ట, పులివెందుల స్థానాలకు ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. ఒంటి మిట్టకు రెండు, పులివెందులకు మూడు చొప్పున దాఖలయ్యాయి. కాంగ్రెస్ పార్టీ తరపున రెండు, వైసిపి తరపున రెండు, జనసేన తరుపున ఒకటి చొప్పున దాఖలయ్యాయి. వైసిపి తరపున పులివెం దులకు రెండు, ఒంటిమిట్టకు మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. ఒంటిమిట్టకు స్థానానికి జనసేన తరుపున సిద్ధవటం మండలం ఉప్పరపల్లికి చెందిన రాటాల రామయ్య, కాంగ్రెస్ పార్టీ తరపున రాజంపేట మండలం ఊటుకూరు గ్రామానికి చెందిన పూల విజయ భాస్కర్ నామినేషన్లు దాఖలు చేశారు. పులివెందులకు కాంగ్రెస్ తరుపున తొండూరు మండలం కృష్ణంగారిపల్లికి చెందిన తుమ్మలూరు అనిల్‌కుమార్‌రెడ్డి, వైసిపి తరుపున పులివెందుల మండలం తుమ్మలపల్లికి చెందిన తుమ్మల హేమంత్‌రెడ్డి, తుమ్మల ఉమాదేవి నామినేషన్లు దాఖలు చేశారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-వాల్మీకిపురం: సీజన్‌లో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని నగిరిమడుగు పిహెచ్‌సి డాక్టర్ చౌదరి నయీమ్ అన్నారు. బుధవారం మండలంలోని అయ్యవారిపల్లిలో నిర్వహించిన 104 సేవలలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గర్భిణులు, రోగులను పరీక్షించి, మందులు, ఐరన్ మాత్రలు పంపిణి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గర్భవతులు దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు చేయించుకొని, కాన్పులు కూడా ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేయించుకోవాలన్నారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి టిబి వ్యాధిగ్రస్తులను, ఇతర జబ్బులతో బాధపడుతున్న వారిని గుర్తించి, వారికి మెరుగైన వైద్యం అందించేందుకు తోడ్పడాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గ్రామంలో పర్యటించి, అబెట్ పిచికారి చేయించారు. ఈ కార్యక్రమమలో ఎంపిహెచ్ఇఒ రామాంజులు, ఎంపిహెచ్ఎ పురుషోత్తం, ఎఎన్ఎం భాగ్యశ్రీ, 104 సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



అబెట్ పిచికారి చేయిస్తున్న డాక్టర్ చౌదరి

రసాయన శాస్త్రంలో సుల్తానాకు డాక్టరేట్

ప్రజాశక్తి-కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర పరిశోధకులు షేక్.సుల్తానాకు డాక్టరేట్‌ను వైవీయూ ప్రకటించింది. రసాయన శాస్త్ర శాఖ ఆచార్యులు ఎన్.సి.గంగిరెడ్డి పర్యవేక్షణలో డిపైఎటైవ్ స్మాల్ ఆర్గానిక్ మాలిక్యుల్స్ ఫర్ ఆప్టోఎలక్ట్రానిక్ అప్లికేషన్ అనే అంశం పైన పరిశోధన చేసి రూపొందించిన సిద్ధాంత గ్రంథాన్ని విద్యాలయ పరీక్షల విభాగానికి సమర్పించారు. విసి మార్గదర్శకంలో నియమితులైన నిపుణుల బృందం పరిశోధన గ్రంధాన్ని పరిశీలించి డాక్టరేట్‌కు అర్హత ఉన్నట్లు ప్రకటించారు. వైవీయూ పరీక్షల నిర్వహణ అధికారి ఆచార్య కె.ఎస్.వి.కృష్ణారావు డాక్టరేట్ నోటిఫికేషన్ జారీ చేశారు. సుల్తానా రాసిన 8 పరిశోధన పత్రాలు జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లో ప్రచురించారు. డాక్టరేట్ అందుకున్న సుల్తానాను విసి ఆచార్య అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, ప్రిన్సిపల్ ఆచార్య టి.శ్రీనివాస్, రసాయన శాస్త్ర శాఖ అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

ఎన్‌బిఎ గుర్తింపు పత్రం స్వీకరిస్తున్న ప్రిన్సిపల్ యువరాజ్

'మిట్స్'కు ఎన్‌బిఎ గుర్తింపు

ప్రజాశక్తి-మదనపల్లె

అంగళ్లు సమీపంలోని మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలో బిటెక్, ఎంబిఎ, ఎంసిఎ కోర్సులకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ నుంచి మూడు సంవత్సరాల పాటు అక్రిడిటేషన్ లభించినట్లు ఆ సంస్థ ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అక్రిడిటేషన్ మాకు విద్యా నైపుణ్యం, నాణ్యమైన విద్య, ఫలితాల ఆధారిత అభ్యాసం పట్ల ఉన్న స్థిరమైన నిబద్ధతకు గుర్తింపని పేర్కొన్నారు. ఇది పరిశ్రమ ఆధారిత కార్యక్రమాలు అమలు చేయడంలో, విద్యార్థుల ఉపాధి అవకాశాలను మెరుగుపరచడంలో కీలకంగా ఉపయోగపడుతుందని తెలిపారు. బిటెక్ విభాగంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సులకు, పోస్ట్ గ్రాడ్యుయేషన్ విభాగాల్లో ఎంసిఎ, ఎంబిఎ ప్రోగ్రాములకు 2028 జూన్ 30 వరకు వర్తిస్తుందని పేర్కొన్నారు. ఆధునిక పాఠ్యాంశాలు, మెరుగైన మౌలిక సదుపాయాలు, అర్హత కలిగిన అధ్యాపకులు, అత్యాధునిక ప్రయోగశాలలు విద్యార్థులకు ప్రయోజనం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ గుర్తింపును పొందడంలో సహకరించిన అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రోగులకు అన్నదానం

ప్రజాశక్తి-రాయచోటి

లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు లయన్ పి.శ్యామ్ ఆర్థిక సాయంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ పి.ఎస్.హరినాథ్‌రెడ్డి తెలిపారు. అనంతరం దాత మాట్లాడుతూ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు అన్నదానం చేసి నందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఇప్పటివరకు అనేక సేవా కార్యక్రమాలు చేశామని రాబోయే కాలంలో మరిన్నీ సేవా కార్యక్రమాలను దాతల సహకారంతో చేస్తా మని తెలిపారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు లయన్ పి.శివారెడ్డి, లయన్ వి.నారా యణరెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు



విద్యార్థులతో సైన్స్ క్లబ్ సభ్యులు, డైట్ అధ్యాపకులు

సామాజిక చైతన్యానికి 'సాంఘిక శాస్త్ర క్లబ్' దిక్సూచి కావాలి : డైట్ ప్రిన్సిపల్

ప్రజాశక్తి-రాయచోటి

విద్యార్థుల్లో సామాజిక స్పృహను పెంపొందించి, వారిని చైతన్య వంతమైన పౌరులుగా తీర్చిదిద్దే ఓ దీపస్తంభంలా సాంఘికశాస్త్ర క్లబ్ సేవలందించాలని డైట్ ప్రిన్సిపల్ అజయ్‌కుమార్‌బాబు సూచించారు. బుధవారం మధ్యాహ్నం జిల్లా విద్యా శిక్షణా సంస్థలో సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నేతాజీ సాంఘిక శాస్త్ర క్లబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో చరిత్ర, రాజకీయ, భూగోళ శాస్త్రం, ఆర్థిక వ్యవస్థలపై అవగాహన పెంపొందించేలా క్లబ్ పని చేయాలన్నారు. పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకునేందుకు, విద్యార్థులలో ఆసక్తిని పెంపొందించేందుకు దోహదపడే కృత్యాధార బోధనకు క్లబ్ తోడ్పడాలన్నారు. అనంతరం ఈ కార్యక్రమానికి హాజరైన మరొక ముఖ్య అతిథి ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు మాట్లాడుతూ విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు అభివృద్ధి చేసేందుకు క్లబ్ తోడ్పడాలన్నారు. పాఠ్యపుస్తకాలకు పరిమితంగా కాకుండా, సమకాలీన సామాజిక సమస్యలపై అవగాహన కల్పించేలా క్లబ్ తన సేవలను అందించాలన్నారు. అనంతరం క్లబ్ అధ్యక్షుడు, సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ సమాజంపై ప్రభావం చూపగలిగే చైతన్యవంతమైన పౌరులను తయారు చేసేలా సేవలందించడమే క్లబ్ ప్రధాన ఉద్దేశమన్నారు. జిల్లాలోని సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు వారి బోధనలో క్లబ్ ద్వారా సహకారాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకట సుబ్బారెడ్డి, శివభాస్కర్, గిరిబాబుయాదవ్ శ్రీనివాసులు, శివప్రసాద్, కేదార్నాథ్, ఉషామాధురి, ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

పిహెచ్‌సిలకు వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించాలని ఎంపిడిఒ మనోహరరాజు అన్నారు. బుధవారం మండలంలోని నగిరిమడుగు పిహెచ్‌సిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ల్యాబ్ రిజిస్టర్లు, వార్డులు, రికార్డులను పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న రోగులతో మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. డాక్టర్లతో సమావేశం నిర్వహించి, ఇక్కడ ఉన్న సదుపాయాలపై చర్చించారు. కార్యక్రమంలో డాక్టర్ చౌదరి నయీమ్, డాక్టర్ రిచార్డ్ స్టీఫె న్, డిప్యూటీ ఎంపిడిఒ సుధాకర్‌రెడ్డి, ఎంపిహెచ్ఇఒ రామాంజులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సదుపాయాలపై ఆరా తీస్తున్న ఎంపిడిఒ

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఎంపిడిఒ మనోహరరాజు అన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాలనలో పారదర్శకతను పెంచడానికి, అవి నీతిని నియంత్రించడానికి తీసుకొచ్చిన చట్టమే సమాచార హక్కు చట్టమన్నారు. సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో పాశుపతాస్త్రం వంటిదన్నారు. ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకుంటే ప్రజలు పలు ప్రయోజనాలు పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. దరఖాస్తు దారులు అడిగిన ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల యొక్క సమాచారం సకాలంలో అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి ఎంపిడిఒ సుధాకర్ రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ లక్ష్మీప్రసన్న, ఎఒ మురళి, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాతో సమాజాభివృద్ధికి విఘాతం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మానవ అక్రమ రవాణాతో సమాజాభివృద్ధికి విఘాతం కలిగిస్తుందని పోర్డ్ సంస్థ డైరెక్టర్ జల్లా లలితమ్మ పేర్కొన్నారు. మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మదనపల్లె మహిళా డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సులో ప్రిన్సిపల్ డాక్టర్ క్రిష్ణవేణి మాట్లాడుతూ సమాజంలో మానవతా విలువలు మెరుగు పడినప్పుడే మానవ అక్రమ రవాణాకు శాశ్వత పరిష్కారం ఉంటుందన్నారు. గత కొన్నేళ్లుగా అనేక మంది అదృశ్యమయ్యారని, వారి ఆచూకీ తెలియక పోవడమే మానవ అక్రమ రవాణాకు నిదర్శనమని అన్నారు. సమష్టిగా సమస్యను ఎదుర్కొన్నప్పుడే అది అదుపులో ఉంటుందన్నారు. పోర్డ్ సంస్థ డైరెక్టర్ జల్లా లలితమ్మ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా ఆనేక రూపాలలో జరిగుతుందన్నారు. బయట వ్యక్తులతో, పరిచయం లేని వారిని నమ్మకూడదని అన్నారు. ఒంటరిగా జాతర్లకు, ఫంక్షన్లకు వెళ్ళకూడదని, పరిచయం లేని వారు ఇచ్చే తిను బండారాలు తీసుకోరాదని తెలిపారు. సెల్ ఫోన్, సోషియల్ మీడియా, ఆన్‌లైన్ స్నేహాలు గురించి అవగాహన కలిగి వుండాలని సూచించారు. విద్యార్థినులు క్రమ శిక్షణతో చదువుకొని మంచి భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని ఆకాంక్షిం చారు. కార్యక్రమంలో న్యాయవాది రమాదేవి, ఎఎస్ఐ రమణ, పోర్డ్ సంస్థ సిబ్బంది ప్రమీల, రాధా రాణి, నిర్మల, అల్తాఫ్, జయలక్ష్మి, నరసింహులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న లలితమ్మ

రోడ్డుపై మురుగునీటి తొలగిస్తున్న జెసిబి

మురుగునీరు తొలగింపు

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల పరిధిలోని మాచిరెడ్డిగారిపల్లి పంచాయతీ, పెద్దబిడిలో ప్రధాన రోడ్డుపై చాలా రోజులు మురుగునీరు నిల్వ ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముగురు నీటితో ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధులు, చిన్నారులు కాలుజారిపడి గాయాల పాలు వుతాన్నరని, మురుగునీరు తొలగించాలని టిడిపి నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు రెడ్డినాయక్, ఉపాధ్యక్షులు కంబాల సుధాకర్, ఎస్‌సి సెల్ అధ్యక్షులు, ఎస్‌టి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆనందనాయక్, దప్పేపల్లి చంద్రమౌళి, ఎన్ఆర్ఐ సిద్దులయ్య, సీనియర్‌నాయకులు పారిశుధ్య పనులు చేపట్టి జెసిబితో రోడ్డుపై ఉన్న మురుగునీటిని తొలగింపజేశారు.

మాట్లాడుతున్న ఎపిఎం దేవయాని

పొదుపు సంఘాలు బలోపేతమవ్వాలి

ప్రజాశక్తి-రామాపురం

గ్రామాల్లో మహిళా పొదుపు సంఘాలు బలోపేతం కావాలంటే గ్రామ సమైక్యలు కృషి చేయాలని వెలుగు ఎపిఎం దేవయాని పేర్కొన్నారు. మండలంలోని వెలుగు కార్యాలయంలో బుధవారం గ్రామ సమైక్యలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోని పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించే విధంగా, సభ్యులు అవసరమైన రుణాలు ఇప్పించడానికి గ్రామ సమైక్య బాగా పనిచేయాలని సూచించారు. సంఘాలోని సభ్యులు తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించని యెడల వారికి అవగాహన కల్పించి పొదుపు సక్రమంగా చెల్లించేలా చూడాలని తెలిపారు. స్త్రీనిధి రుణాలు బ్యాంకు రుణాలు వ్యక్తిగత రుణాలు ఇలాంటివి స్వయంసహాయ సంఘాలకు అందిస్తున్నారని అన్నారు. సభ్యులు వీటిని సక్రమంగా చెల్లించే విధంగా అవగాహన కలిగించాలన్నారు. విఏలు వారి కేటాయించిన పొదుపు సంఘాలు పనితీరు తమ మొబైల్‌లో పొందు పరచాలని, సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించి ఉత్తమ పొదుపు సంఘాలుగా తీర్చిదిద్దే బాధ్యత విఏలదేనని అన్నారు. ఈ సమావేశంలో సిసిలు నాగరాజు, నరసింహులు, రెడ్డిబాబు, గంగాధర్ రాజు, విఏలు, గ్రామ సమైక్యసభ్యులు పాల్గొన్నారు.

నేడు 'ఆదిత్య'లో మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని స్థానిక రంగసముద్రం రోడ్డు, ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఎపి స్టేట్ స్కిల్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సహకారంతో గురువారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎల్.ప్రసాద్ జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి నాగార్జున తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాబ్ మేళాలో సన్ ఖిల్, రామోజిస్, శ్రీరామ్ బిల్ట్ లైఫ్ ఇన్సూరెన్స్, ఆద్య హెచ్.ఆర్ సొల్యూషన్స్, సిఎంఎస్, రాజసన్, ముకుంద ఫుడ్స్, జంబో బ్లైట్, ఎఫ్ఐఐ, అపోలో, టాటా ఎలక్ట్రానిక్స్, పేటియం, యంగ్ ఇండియా, అమెజాన్, ముత్తూట్ ఫైనాన్స్, స్విగ్గీ,హెచ్‌డిబి బ్యాంక్, తదితర కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, ఫార్మసీ, డిగ్రీ చదివిన విద్యార్థులు ఆధార్, బయోడేటా, సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలు తీసుకొని జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. రిజిస్ట్రేషన్ కొరకు 9966655167, 8328347130 మొబైల్ నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పి4ను విజయవంతం చేయండి : డిఇఇ

ప్రజాశక్తి-కలికిరి

పి4 కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు సహకరించి విజయవంతం చేయాలని డిఇఇ సుబ్రహ్మణ్యం సూచించారు. మండలం మరికుంటపల్లి గ్రామపంచాయతీ సచివాలయంలో బుధవారం ఎంఇఒ కమిటీ, నాగార్జున మరికుంటపల్లి గ్రామ సర్పంచ్ రెడ్డిరామ్, మొరం కిందపల్లి గ్రామ సర్పంచ్ అరుణకుమార్ ఆధ్వర్యంలో పి4 కార్యక్రమం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఇ మాట్లాడుతూ పి4 అనగా డబ్బు సహాయమే కాదని పేద ప్రజలకు ఆర్థిక సహాయంతో పాటు వారికి సమాజం పట్ల పూర్తి అవగాహన కల్పించడమేనని అన్నారు. పదవ తరగతి వరకు చదువుకున్న వారికి పై చదువులు చదవాలని ఆలోచనలో ఉంటారని అలాంటి వారిలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఆ విద్యార్థుల ప్రతిభను బట్టి తగిన ఉద్యోగాలు చేసుకోవడానికి వారికి అవగాహన కల్పించడం కూడా పి4 లో ఒక భాగమేనని అన్నారు. చదివేవాండ్లపల్లి పాఠశాల, మహల్ జడ్పిహెచ్ఎస్, తెలుగు పాఠశాలలను సందర్శించి పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు రెండు ప్రశ్నలు వేసి ఆ ప్రశ్నలకు వారి దగ్గర నుంచి సమాధానం రాయించడం లాంటి కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తర్వాత ఎంఇఒలు కమిటీ, నాగార్జున, సర్పంచులు రెడ్డిరామ్, అరుణ్ కుమారులు కూడా పి4 గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామపంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఒలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వితంతు కొత్త పింఛన్ల కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి-కలికిరి

పింఛన్ల కోసం వితంతువుల నిరీక్షణ చేస్తున్నారని కొత్త పెన్షన్లకు మోక్షం ఎప్పుడు లభిస్తుందోనని ఉమ్మడి రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొత్తగా వితంతు పింఛన్లు మంజూరై మూడు నెలలు పూర్తి కావస్తున్న వాటి పంపిణీ కోసం ఎదురుచూస్తూ, నిరీక్షిస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్నా ఒక్క కొత్త పెన్షన్ కూడా ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు పింఛను దారుడు చనిపోతే, వితంతు భార్యకు ఆ మరుసటి నెల నుంచే పింఛను మంజూరు చేయ్యదన్నారు. ఇప్పటికైనా వితంతువుల బాధలను చూసి, లబ్ధిదారులకు ఆగస్టు 1వ తేదీన పింఛన్లు పంపిణీ చేయాలన్నారు.

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE : MADANAPALLE

I.A.No. 8/2021
O.S.No. 335/12

M. Prabhavathamma. **...Petitioner/Plaintiff**
Vs
A. Lakshmamma and Others. **...Respondents/Defendants**

NOTICES TO RESPONDENTS 62 TO 64

R62. Kondaiah gari Subramanyam, S/o K.Subba ramaiah, D.No.6-999, R.S.Road, Rajampeta, Kadapa Dist.
R63. P.Sravani, D/o P.Siva, D.No.2-224-2, Kuravanka, NTR Circle, Madanapalle Town.
R64. Avula Dinesh, S/o A.Bhaskar Reddy, D.No. 4-1-5-F-2, Krishna Nagar, Madanapalle Town.

పై కేసులోని Respondents 62 నుండి 64 వరకు అయిన మీరు కోర్టు నోటీసులను తీసుకోనందున, సదరు నోటీసులను మీకు పత్రికా ముఖంగా చేర్చుటకు కోర్టు వారు ఉత్తర్వు వేయడమైనది. కావున మీరు పై కోర్టు నందు 05.08.2025 నాడు ఉ॥గం॥ 10.30లకు హాజరు కావలెను. లేనంతట మీ పరోక్షమున కేసును తీర్మానించబడునని యిందుమూలంగా తెలియజేయడమైనది.

//By Order of the Court//
Y. SAMBASIVA REDDY
Advocate,
MADANAPALLE.

రైతులకు అందుబాటులో నాణ్యమైన మొక్కలు

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

స్థానిక పట్టణంలోని లోని ప్రభుత్వ ఉద్యాన శాఖ వారి ఎపి మోడల్ నర్సరీలో నాణ్యమైన చీనీ, నిమ్మ మొక్కలు ఉద్యాన రైతులకు అందుబాటులో ఉన్నాయని హార్టికల్చర్ ఫామ్ ఉద్యాన అధికారి బి.లోకేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో చీని, నిమ్మ తోటలలో చీడపీడలు ఉధృతి పెరగడం వలన పంటల విస్తీర్ణం క్రమంగా తగ్గుతోందని అన్నారు. ఈ సమస్యను అధిగమించడానికి రైతులు మేలైన రకాలు, నాణ్యమైన మొక్కలను ప్రభుత్వ నర్సరీల నుంచి కొనుగోలు చేయాలని తెలిపారు. ప్రధానంగా మొక్కల ఎంపికలో జాగ్రత్త వహించాలని, చీనిలో అయితే రంగపూర్ మీద అంటు కట్టిన రెండు నుంచి రెండున్నర అడుగుల ఎత్తు కలిగి, నాలుగైదు ఆరోగ్యకరమైన కొమ్మల నుంచి రెండున్నర నుండి మూడున్నర సెంటీమీటర్లు మందం కలిగిన మొక్కలను ఎంపిక చేసుకోవాలన్నారు. దీని వల్ల చీడపీడలను తట్టుకొని అధిక దిగుబడులను పొంద వచ్చని అన్నారు. నిమ్మలో బాలాజీ, పెట్లూరు సెలెక్షన్ వంటి నిమ్మరకాలను సాగు చేయ డం వలన చీడపీడలను తట్టుకొని రైతులు అధిక దిగుబడులను పొందవచ్చునని తెలి పారు. ఉద్యాన రైతులకు నాణ్యమైన మొక్కలను అందించే ఉద్దేశంతో ఉద్యాన శాఖ ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ ఎపి మోడల్ నర్సరీ నందు రంగపూర్ మొలకలపై కట్టిన చీని అంట్లు 80 వేలు, పెట్లూరు నిమ్మ మొక్కలు 15 వేలు దాకా రైతులకు అందుబాటులో ఉన్నాయని అన్నారు. తమ నర్సరీలో చీని మొక్క ధర రూ.55, నిమ్మ మొక్క ధర రూ.25 గాను, ఉపాధి హామీ రైతులకు మొక్కలను అందిస్తామని తెలిపారు. రైతులు ఉద్యాన శాఖ అధి కారుల సలహాలు, సూచనలు పాటించి నాణ్యమైన మొక్కలను ఎంపిక చేసుకొని సాగు చేయడం ద్వారా సుమారు 30 సంవత్సరాల వరకు కూడా చెట్లు మన్నికనిస్తాయని తెలపారు.

ప్రభుత్వ మోడల్ నర్సరీలో అందుబాటులో ఉన్న చీనీ,నిమ్మ మొక్కలు

హాకీ టోర్నీ రన్నరప్‌గా కలికిరి బాలికల జట్టు

ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ హాకీ టోర్నమెంటులో రన్నరప్‌గా నిలిచిన బాలికల జట్టు

ప్రజాశక్తి-కలికిరి

ఆలిండియా సైనిక్ స్కూల్ హాకీ టోర్నమెంట్ 2025లో రన్నరప్‌గా సైనిక్ స్కూల్ బాలికలు జట్టు నిలిచినట్లు పాఠశాల ప్రిన్సిపల్ సిఎస్ పరదేశి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైనిక్‌స్కూల్ చరిత్రలో మొదటిసారి జాతీయస్థాయిలో బాలికలు హాకీ టోర్నమెంట్ నిర్వహించడం జరిగిందని అన్నారు. అందులో కలికిరి బాలికలు ఫైనల్‌కు చేరడం ఆనందదాయకమని, 16 మంది సభ్యులు జట్టు అసాధారణ నైపుణ్యం, పట్టదలతో మెరిపించి మైంన్ పురి, కపుర్తలా, సంబల్పూర్ లాంటి శక్తివంతమైన జట్లపై గెలుపొందుతూ ఫైనల్ కి ప్రవేశించిందని అన్నారు. ఈస్ట్ సియాంగ్ సైనిక్ స్కూల్లో జరిగిన ఉత్కంఠ భరిత ఫైనల్లో కలికిరి జట్టు అద్భుతమైన సమన్వయం పోరాట శక్తిని ప్రదర్శించి పోరాడినప్పటికీ వారు తక్కువ తేడాతో గెలుపును కోల్పోవడం బాధాకరమని, అన్నారు. 1-2 స్కోర్ లైన్‌తో ముగిసిన ఈ మ్యాచ్‌లో వారు గౌరవప్రదమైన సిల్వర్ ట్రోఫీని గెలుచుకున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ టోర్నమెంట్‌లో వేద ప్రజ్ఞ అత్యుత్తమ గోల్డ్ కీపర్‌గా ఎంపికై ప్రత్యేక గుర్తింపు పొందిందని తెలిపారు. క్రీడలలో పాల్గొంటే విద్యా ప్రవీణ్యం, శారీరక దృఢత్వం మరియు స్వభావ పరిపక్వత కలబోతగా ఉండే సమగ్ర అభివృద్ధికి తోడ్పడుతూ భవిష్యత్ నాయకులను తీర్చిదిద్దరమే తమ లక్ష్యం అని ఆయన తెలిపారు. ఈ విజయం సైనిక్ స్కూల్ కలికిరి బాలికల స్ఫూర్తిదాయక మైలు రాయిగా ఆయన అభివర్ణించారు.

చిన్నారులకు పౌష్టికాహారం తప్పనిసరి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులకు పౌష్టికాహారం తప్పనిసరిగా అందించాలని తహశీల్దార్ తపస్వని పేర్కొన్నారు. బుధవారం కొండయ్యగారిపల్లెలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. కేంద్రంలోని విద్యార్థులు, గర్భిణులు, బాలిం తలకు అందిస్తున్న పౌష్టిక ఆహారంపై ఆరా తీశారు. పలు రికార్డులను, స్టాకు రిజిస్టర్ లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలను బలో పేతం చేయాలని అన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనతను, పౌష్టికాహార లోపాలను అధిగమించడానికి బాలామృతం, కోడిగుడ్లు, పాలను ప్రభుత్వం ప్రతి నెలా అందిస్తోందని అన్నారు. విద్యార్థులకు అక్కడే వండి పెట్టాలని సూచించారు. చిన్నా రుల ఎదుగుదలను, ఆరోగ్యాన్ని వైద్య ఆరోగ్య సిబ్బంది తరచూ పరిశీలించాలన్నారు. సచివాలయంలోని మహిళా సంరక్షణ కార్యదర్శులు కూడా తరచూ అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి వాటి నిర్వహణ చూడాలని ఆదేశించారు. అంగన్వాడీ కార్యకర్తలు ప్రీస్కూల్ తరహాలో విద్యార్థులకు విద్యాభ్యాసాన్ని బోధించి అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేయా లన్నారు. దీనిపై గతంలోనే అంగన్వాడీ కార్యకర్తలకు పలు దఫాలు శిక్షణ కూడా ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి సయ్యద్ సుల్తానా, అంగన్వాడీ కార్యకర్త పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న తహశీల్దార్ తపస్విని

విద్యతోనే ఉన్నత శిఖరాలు : 'మేడా'

బహుమతులు పొందిన విద్యార్థులతో విజయభాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - నందలూరు

విద్య ద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించచరుని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నాగిరెడ్డిపల్లి జడ్‌పి హైస్కూల్‌లో నాగిడిపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకులు అందజేసే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం సిఎం చంద్రబాబు అనేక రకాల సంక్షేమ పథకాలతో పాటు ప్రతి ఒక్కరికి యూనిఫామ్ నాణ్యమైన భోజనం మూలిక వసతులు తల్లికి వందనం కార్యక్రమాల పేరుతో ముందుకు తీసుకువెళ్తున్నారని అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల్లో మానసికంగా శారీరకంగా శక్తిని పెంపొందించు అందుకోసం ఉదయం రాగి జావా చీకీలు నాణ్యమైన ఆహార పదార్థములను అందిస్తున్నారు. ఈ పాఠశాల తో పాటు బాలికల కళాశాలలో ఇంత గొప్ప ఉపాధ్యాయులు పనిచేయడం తనకెంతో సంతోషంగా ఉందని విద్యార్థులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకొని బాగా చదివి పాఠశాల తో పాటు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. సర్పంచ్ సూర్యనారాయణ మాట్లాడుతూ తాము అందించిన నగదు ప్రోత్సాహకులు కేవలం కొంతమేర చిన్న సహాయమే అని విద్యార్థులు ఇంకా బాగా చదివి తద్వారా ఉన్నత పదవులు పొందాలన్నారు. ఆగస్టు15న నిర్వహించే క్రీడ సంస్కృత పోటీలకు సంబంధించి విద్యార్థులందరికీ బహుమతులు అందిస్తామన్నారు. పదో తరగతిలో అఖిల్, ప్రథమ ,ఆశిక్ ద్వితీయ యేసుప్రియ, తృతీయ స్థానంలో ఇంటర్మీడియట్ ప్రథమ మోబినా, ద్వితీయ అక్షయ, తృతీయ గాయత్రిలకు రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు చొప్పున నగదు ప్రోత్సాహంతో పాటు మొమెంటోలు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టిడిపి నాయకులు ధనుంజయ నాయుడు సిరిసిల్ల నాగేంద్ర, దండు నాగేశ్వరరావు, మట్టిబాబు, మెహర్ కనకుర్తి, వెంకటయ్య పాల్గొన్నారు.

అవార్డు అందుకోవడం గర్వంగా ఉంది

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సేవా మార్గంలో నిలకడగా ముందుకెళ్తున్న వెలుగు సేవా సంస్థకు జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 19వ సేవా ధార్మిక్ అవార్డు వరించింది. ఈ సందర్భంగా వరంగల్‌లోని కాళోజీ కళాక్షేత్రం ఆడిటోరియంలో జూలై 26న అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి కేంద్ర,రాష్ట్ర స్థాయి ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, మానవతావాదులు హాజరయ్యారు. బుధవారం వెలుగు సెక్రటరీ ఉదయ్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నాలుగు రాష్ట్రాలు తమిళనాడు నుంచి అక్షయ ట్రస్ట్, మహారాష్ట్ర నుంచి పల్లవి, తెలంగాణ నుంచి అభయ ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్ నుంచి ఏకైక ప్రతినిధిగా వెలుగు ఎంపిక కావడం విశేష గౌరవంగా నిలిచిందన్నారు. 1997లో స్థాపితమైన వెలుగు సేవా సంస్థ, ప్రస్తుతం 145 మంది విభిన్నప్రతిభావంతులు, 65 మంది వృద్ధులకు వృద్ధాశ్రమ నిర్వహణ, అనేక సేవా కార్యక్రమాలను ఉచితంగా అందిస్తోందన్నారు. ఈ గౌరవం గత 28 ఏళ్లుగా వెలుగు సేవా యాత్రలో భాగమైన ప్రతి ఉద్యోగస్తులకు,స్వచ్ఛంద సేవకులకు అంకితం చేస్తున్నామన్నారు. ఈఅవార్డు ఒక మైలురాయిగా నిలు స్తోందని, భవిష్యత్తులో మరింత విస్తృతంగా సేవలందించే దిశగా కృషి చేస్తామన్నారు.

'శ్రీభువన'లో స్కౌట్ యూనిట్

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు శ్రీభువన విద్యాలయంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ప్రారంభించడానికి అనుమతులు లభించాయని పాఠశాల కరస్పాండెంట్ ఉమా రమాదేవి, ప్రిన్సిపల్ గుణలక్ష్మి తెలిపారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి నుంచి అనుమతి కూడా లభించిందని అన్నారు. కడప, అన్నమయ్య జిల్లాల స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా అధికారి లక్ష్మీకర్ బుధవారం పీలేరు శ్రీ భువన విద్యాలయాన్ని సందర్శించారని చెప్పారు. యూనిట్ ఏర్పాటు, సభ్యుల ఎంపిక, శిక్షణా కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించిన ఆయన పాఠశాలలో జరుగుతున్న చర్యలపై సంతృప్తిని వ్యక్తం చేశారు. విద్యార్థులలో సేవా భావన, సామూహిక చింతన, నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేయడంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ పాత్ర అమోఘమని ఆయన తెలిపారు. విద్యార్థుల్లో సేవా దృక్పతంతో పాటు నాయకత్వ లక్షణాలు అలవడుతాయని అన్నారు. విద్యార్థులు స్కౌట్‌లో భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయుల సహకారం ప్రశంస నీయమని, తదుపరి దశలో రాష్ట్ర స్థాయిలో ప్రాతినిధ్యం వహించేలా యూని ట్‌ను మరింత మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన శక్తి యాప్‌తో మహిళలకు, బాలికలకు సంపూర్ణ రక్షణ కలుగుతుందని మదనపల్లె శక్తి టీం ఇన్‌చార్జి ఎస్ఐ గాయత్రి తెలిపారు. బుధవారం దీక్ష స్కూల్ లో శక్తి టీం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి విద్యార్థులకు తెలిపారు. మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న వేధింపులు, ర్యాగింగ్ వంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకుని ఆపద సమయాల్లో యాప్ ద్వారా సమాచారం ఇస్తే క్షణాల్లో పోలీసు అక్కడ చేరుకొని సాయం చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులు తమ భద్రత కోసం శక్తి యాప్‌ను తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. బెట్టింగ్ యాప్‌ల వల్ల జరిగే ఆర్థిక నష్టాలు, ఆన్‌లైన్, సైబర్ నేరగాళ్ల పట్ల మహిళలు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. సోషల్ మీడియా వినియోగంలో మహిళలు అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోకూడదని సూచించారు. శక్తి యాప్ ద్వారా ఎలా సహాయం పొందవచ్చు ప్రాక్టికల్ గా చేసి చూపించారు. కార్యక్రమంలో శక్తి టీం సిబ్బంది, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'పెద్దిరెడ్డి' కుటుంబంపై కక్ష సాధింపు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బి.కొత్తకోట

కూటమి ప్రభుత్వం, సిఎం చంద్రబాబు పెద్దిరెడ్డి కుటుంబాన్ని అన్నివిధాలుగా ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని అరెస్టు చేయించి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆరోపించారు. బుధవారం రాజమండ్రి జైలులో ఉన్న ఎంపీ మిథున్ రెడ్డితో ఆయన ములాకత్ అయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికొదిలేసి కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. ఎటువంటి ఆధారాలు లేకుండా లిక్కర్ స్కాంలో ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. పెద్దిరెడ్డి కుటుంబం ఎప్పుడు ప్రజల పక్షాన ఉంటుందని, వారి సమస్యలపై పోరాడుతుందని స్పష్టం చేశారు. సిఎం చంద్రబాబు ఆయన తనయుడు లోకేష్ అన్ని మోసపూరిత విధానాలతో ముందుకు వెళ్తారని అన్నారు. ఎన్ని ఇబ్బందులు పెట్టిన పెద్దిరెడ్డి కుటుంబం ఎదురొడ్డి నిలుస్తుందని, కాలం ఎప్పుడూ ఒకే విధంగా ఉండదని మా సమయం వచ్చినప్పుడు వడ్డీతో సహా చెల్లిస్తామనిహెచ్చరించారు.

సాయం చేయాలని కోరుతున్న వృద్ధ దంపతులు

పింఛను మంజూరు చేసి ఆదుకోండి

- అధికారులకు వృద్ధ దంపతుల వేడుకోలు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని వృద్ధ దంపతులు వేడుకుంటున్నారు. పట్టణంలోని బిసి కాలనీకి చెందిన మునెమ్మ, కృష్ణప్ప వృద్ధ దంపతులు నివాసంటున్నారు. మునెమ్మ గత కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యం కారణంగా మంచానికి పరిమితం కావడంతో నెలకు రూ.10 నుంచి రూ.15వేల వరకు మందులకు ఖర్చు అవుతున్నాయని అన్నారు. కుటుంబ పోషణ భారంగా ఉందని తమకు ఆర్థిక సోమత సరిపోవడం లేదని కన్నీటి పర్యంతమయ్యారు. సదరం క్యాంపులో దరఖాస్తు చేసామని మునెమ్మ మంచానికే పరిమితం అవడంతో ఆమెను తీసుకెళ్లడానికి వీలు లేక ఇంట్లోనే నరకయాతన అనుభవిస్తున్నామని తెలిపారు. సంబంధిత అధికారులు చొరవ చూపి వృద్ధురాలైన మునెమ్మకు పింఛన్ మంజూరు చేసి వారి కుటుంబానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఊరు ఖాళీ చేయమంటున్నారు

ప్రజాశక్తి-పీలేరు

మాట్లాడుతున్న అధికారులు

తరతరాలుగా తాము నివాసం ఉంటున్న ఊరును ఖాళీ చేయమంటున్నారు. ఇదెక్కడి న్యాయం దేవరా అంటూ బోడుమల్లు వారిపల్లి ఎస్‌సి కాలనీవాసులు అధి కారులకు మొరపెట్టుకున్నారు. బుధవారం మండలంలోని బోడుమ ల్లువారిపల్లి పంచాయితీ ఎస్‌సి కాలనీలో బుధవారం సివిల్ రైట్స్ డే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు అధికారులతో మాట్లాడుతూ తాము తర తరాలుగా ఎస్‌సి కాలనీలో నివాస ఉంటున్నామని, 1994లో ప్రభుత్వం 40 కుటుంబాలకు పక్కా గృహాలు మంజూరు చేసిందని అన్నారు. తాము ఇళ్లు కూడా నిర్మించుకొని నివాసాలు ఉంటున్నామని అన్నారు. ఇటీవల ఈ గ్రామాన్ని ఖాళీ చేయాలంటూ ఓ కుటుంబం తమకు కోర్టు ద్వారా నోటీసులు జారీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని సిసి రోడ్లు బాగా దెబ్బతిన్నాయని, మురుగునీటి కాలువలు పూడిపోయాయని, వీధి దీపాలు కూడా మరమ్మతులు చేయాలని, తమకు ఉపాధి పనులు కల్పించాలని అధికారులను విన్నవించారు. గ్రామస్తుల విన్న పాలమేరకు స్పందించిన తహశీల్దార్ శివకుమార్ మాట్లాడుతూ తక్షణమే వీధి దీపాలు మరమ్మతులు చేసి, పూడిపోయిన కాలువలు శుభ్రం చేయిస్తామని అన్నారు. గ్రామంలో కావలసిన మౌలిక వస్తువులకు ప్రతిపాదనలు పంపుతా మని చెప్పారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులతో పాటు గ్రామస్తులు, విద్యార్థి నాయకుడు భాను ప్రకాష్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గర్భిణి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కుటుంబ సమస్యలతో ఏడు నెలల గర్భిణి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ఈ సంఘటన బుధవారం మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని బొమ్మనచెరువు పంచాయతి టేకులపాలెంకు చెందిన రాము భార్య మౌనిక ఏడు నెలల గర్భిణీ. కుటుంబ సమస్యలపై భర్త రాముతో గొడవపడింది. తీవ్ర మనస్తాపానికి గురై చీమల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబీకులు గమనించి బాధితురాలిని వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. తాలూకా పోలీసులు విచారణ చేస్తున్నారు.

కుటుంబ సమస్యలతో మరో వ్యక్తి..

మదనపల్లె అర్బన్ : కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన బుధవారం పిటిఎం మండలంలో జరిగింది. బాధితుని కుటుంబ సభ్యుల కథనం మేరకు.. నాగరాజు, రమణమ్మ దంపతులు కుటుంబ సమస్యలపై గొడవపడ్డారు. తీవ్ర మనస్థాపానికి గురైన నాగరాజు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధ్యతున్ని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. పిటియం పోలీసులు విచారిస్తున్నారు.

అప్పులబాధతో కార్పెంటర్..

మదనపల్లె అర్బన్ : అప్పుల బాధతో కార్పెంటర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన బుధవారం పుంగనూరు మండలంలో జరిగింది. బాధితుని కుటుంబ సభ్యుల కథనం మేరకు.. బసినేపల్లికి చెందిన రెడ్డప్ప (35) కార్పెంటర్‌గా పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో కుటుంబ అవసరాల నిమిత్తం, వ్యాపార నిమిత్తం పలువురు దగ్గర సుమారు రూ.4 లక్షల వరకు అప్పులు చేశాడు. అయితే పనులు సక్రమంగా జరగకపోవడం,కుటుంబ పోషణ భారంగా మారడంతో చేసిన అప్పులు తీర్చలేకపోయాడు. అప్పిచ్చిన వారి నుంచి ఒత్తిళ్లు ఎక్కువ కావడంతో తీవ్ర మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితున్ని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రిఫర్ చేశారు. పుంగునూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యుదాఘాతంతో బెంగాల్ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన బుధవారం నిమ్మనపల్లి మండలంలో జరిగింది. బాధితుని స్నేహితుడి కథనం మేరకు.. వెస్ట్ బెంగాల్ చెందిన కొంతమంది మదనపల్లెకు వలస విద్యుత్ తీగలు లాగే పనిలో చేరారు. సునేరా మెహరాన్, మరో యువకుడు కలిసి నిమ్మనపల్లి మండలం రెడ్డివారిపల్లె నుంచి బాలేవాండ్లపల్లె వరకు పోలుపై విద్యుత్ తీగలు లాగుతుండగా ఒక్కసారిగా విద్యుత్ సరఫరా రావడంతో సునేరా మెహరాన్ కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే తోటి పనివాడు అతన్ని 108లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అందించి పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రిఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో ఢీకొని యువకుడి పరిస్థితి విషమం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆటో ఢీకొన్న ఘటనలో యువకుడి పరిస్థితి విషమంగా మారింది. ఈ సంఘటన బుధవారం సాయంత్రం మదనపల్లె పట్టణంలో జరిగింది. బాధితుని కుటుంబ సభ్యుల కథనం మేరకు.. పుంగనూరు మండలం, ఈడిగపల్లె సమీపంలోని షికారిపాళెం కు చెందిన రాజబాబు, శంషా దంపతుల కుమారుడు ప్రవీణ్ తన అక్క రూపవంతి, బావ హరికృష్ణ లతో కలిసి బొమ్మల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మదనపల్లి నుంచి సాయంత్రం వారి సొంత ఆటోలో స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యంలోని మహీంద్రా షోరూం వద్ద ఆటో దిగి రోడ్డు పక్కన నిలబడి ఉండగా అటుగా వచ్చిన మరో ఆటో ప్రవీణ్‌ను ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధ్యతున్ని అక్కా, బావ తమ సొంత ఆటోలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రిఫర్ చేశారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.